వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ


ఆలయ భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రంగారెడ్డి ఆయన కుటుంబ సభ్యులు

హయత్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మునగనూర్‌లోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ భూమి పూజ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కుటుంబ సమేతంగా హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక కొండపైన నిర్మించే ఈ ఆలయంలో కృష్ణశిలతో వేంకటేశ్వరస్వామిని ప్రతిష్ఠిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. శృంగేరి శారద పీఠ పండితులు బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రీ చేత పూజ నిర్వహించారు. కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, స్థానిక కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, ఐలయ్య, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు యాదిరెడ్డి, అంజయ్య, వెంకట్‌రెడ్డి, రాజుగౌడ్, వాసు, అభిషేక్‌రెడ్డి, సంజీవరెడ్డి, భాస్కరాచారి పాల్గొన్నారు.

బ్యాట్ పట్టిన ఎమ్మెల్యే సబితారెడ్డి


బాక్స్ క్రికెట్ గ్రౌండ్ ప్రారంభించి బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలోని రాఘవేంద్రనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను సోమవారం మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె బ్యాట్ పట్టి పలు బంతులను ఎదుర్కొని సందడి చేశారు. పలువురు కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీ, కౌన్సిలర్ కృష్ణారెడ్డి

దశలవారీగా అభివృద్ధి పనులు : చైర్‌పర్సన్ జయశ్రీ

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దశలవారీగా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు తెలిపారు. పెద్దఅంబర్‌పేట్‌లోని 7వ వార్డులో రూ.8లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానిక కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డితో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం జయశ్రీ మాట్లాడుతూ సీసీ, డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కౌన్సిలర్ కృష్ణారెడ్డి సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ సిద్దంకి కృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖలీం, నాయకులు విజయేందర్‌రెడ్డి, సురేష్, ప్రశాంత్‌రెడ్డి, కాంట్రాక్టర్ రవీందర్, కాలనీవాసులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని రాణించాలి

● గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

వనస్థలిపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని రాణించాలని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ రాంరెడ్డి కాలనీలోని నారాయణ సీబీఎస్సీ పాఠశాల స్పోర్ట్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి హాజరై క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుని రాణించాలన్నారు. క్రీడలు శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాలల జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం రవీంద్రబాబు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పీఈటీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే వివరాల నమోదుకు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ : కమిషనర్

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలు అనివార్య కారణాలతో నమోదు చేయించుకోని వారి కోసం పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని దాదాపు సర్వే పూర్తి కావచ్చిందన్నారు. సర్వే సమయంలో ఇంట్లో లేని, అనివార్య కారణాలతో సర్వే వివరాలు నమోదు చేయించుకోని వారు ఈ నెల 26,27 తేదీల్లోగా తమ సర్వే వివరాలను తప్పని సరిగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. 8121437392, 9912050475 ఫోన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

మీర్‌పేట్‌లో సమస్యలను పరిష్కరించండి


కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గోపాల్‌రెడ్డి తదితరులు

సరూర్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీపీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కమిషనర్ జ్ఞానేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా కాలనీల్లో కుక్కలు, పందుల బెడద ఎక్కువైందని ఆయన కమిషనర్‌కు వివరించారు. చెత్తాచెదారం సక్రమంగా తొలగించకపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, దాంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కుక్కలు, పందుల బెడద కారణంగా కాలనీల్లో మహిళలు, వృద్ధులు, పిల్లలు భయాందోళనకు గురవుతున్నారని ఆయన అన్నారు. ఆయా సమస్యలపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని గోపాల్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.రవీందర్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

ధన్వంతరి వైద్యంతో మొండి రోగాలు నయం

● వ్యాపార వేత్త ప్రవీణ్‌కుమార్‌రెడ్డి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

హయత్‌నగర్ : ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని సోమవారం హయత్‌నగర్‌లోని అయ్యప్ప ఆలయంలో ఆరోగ్య భారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపార వేత్త వంగేటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. అనాది కాలం నుంచి ధన్వంతరి వైద్యం వల్ల అనేక రోగాలు నయం అయ్యాయని గుర్తు చేశారు. ప్రజలు వ్యాధులు, రోగాల బారిన పడకుండా సూచనలు, సలహాలు అందించే సంస్థ ఆరోగ్య భారతి అని కొనియాడారు. కార్యక్రమంలో ఆరోగ్యభారతి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల క్షేత్ర ప్రముఖ్ కుమారస్వామి, కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంసింగ్, చెన్నమోని శ్రీనివాస్, కళ్లెం శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల నెలవు.. భద్రత కరువు

● కొత్త పాలకవర్గంతోనైనా మాదన్నపేట మార్కెట్ మారాలని ఆశలు


మాదన్నపేట మార్కెట్‌లో అమ్మకాలు

సైదాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా షెడ్లు, దుర్గంధభరితంగా మార్కెట్ ఆవరణ, చిన్నపాటి వర్షం కురిసినా అడుగుతీసి అడుగు వేయలేని దారుణ పరిస్థితి, అర్ధరాత్రి అక్రమ వ్యాపారాలు, లైబజారు, పార్కింగ్‌ల పేరిట అక్రమ వసూళ్లు, ప్రేక్షకపాత్రలో మార్కెటింగ్ అధికారులు.. ఇదీ మాదన్నపేట కూరగాయల మార్కెట్ దుస్థితి.. గతంలో పాలకవర్గాలు ఆర్భాటం చేశాయే తప్ప సమస్యలు పరిష్కరించిన దాఖలాలులేవు. కొత్త పాలకవర్గం కొలువుదీరిన నేపథ్యంలోనైనా మార్కెట్‌లో సమస్యలపై దృష్టి సారించాలని రైతులు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, వినియోగదారులు కోరుతున్నారు.

వసూళ్లకే పరిమితమైన అధికారులు

మాదన్నపేట మార్కెట్ ప్రైవేటు స్థలమంటూ సాకు చెబుతూ అధికారులు చేతులెత్తేశారు. ఆస్తిపన్ను వసూలు చేస్తూ జీహెచ్‌ఎంసీ, మార్కెట్ సెస్ వసూలు చేస్తూ మార్కెటింగ్‌శాఖ ఆదాయాన్ని గడిస్తూ ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయి. మార్కెట్‌లో అక్రమ వ్యాపారాలు, లైబజారు, అక్రమ పార్కింగ్ ఫీజు వసూళ్లు, రాత్రి వేళల్లో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వస్తున్న కరివేపాకు, కోతిమీర, జీరో వ్యాపారం యథేచ్ఛగా జరుగుతున్నా పట్టించుకునే వారు లేరు. మార్కెట్‌లో చెత్త తరలింపునకు కిలోకు రూ.2.25 చెల్లించాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్-7 అధికారులు నిర్ధారించారు. ఈ విధంగా ఇప్పటికే సుమారు రూ.2కోట్లకు పైగానే మార్కెటింగ్‌శాఖ బకాయి ఉన్నట్లు జీహెచ్‌ఎంసీ సిబ్బంది తెలిపారు. దీంతో మార్కెట్ ఆవరణలో చెత్త తరలింపు సమస్య ఇబ్బందికరంగా మారింది.

ప్రమాదకరంగా షెడ్డు..

ప్రమాదకరంగా మారిన షెడ్డులోనే రైతులు, వ్యాపారులు గత్యంతరం లేక ఆకు కూరగాయల అమ్మకాలు సాగిస్తున్నారు. ఓ వైపు ఒరిగిన రేకుల షెడ్డు ఎప్పుడు కూలుతుందోనని భయంతో అమ్మకాలు సాగిస్తున్నామని వారు తెలిపారు. పలుమార్లు షెడ్డు పరిస్థితిపై మార్కెటింగ్‌శాఖ అధికారులు, గత పాలకవర్గం సభ్యుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని వాపోయారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.

త్వరలోనే మార్కెట్‌ను సందర్శిస్తాం..



త్వరలో మార్కెట్ చైర్మన్, మిగతా డైరెక్టర్లు, అధికారులతో కలిసి మాదన్నపేట మార్కెట్‌ను సందర్శిస్తాం. రైతులు, వ్యాపారులతో సమావేశమై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. మార్కెట్‌లో అక్రమాలను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పాలకవర్గంలో నిర్ణయాలు తీసుకుంటాం. రైతులు, వ్యాపారులను, వినియోగదారులను ఇబ్బందులు కలిగించేవారిపై చర్యలు తీసుకుంటాం.

- కోట్ల శ్రీనివాస్, వైస్‌చైర్మన్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ

కాస్త పట్టించుకోరూ !

మాదన్నపేట మార్కెట్‌పై అధికారుల నియంత్రణ, పాలకవర్గం పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరికి వారే ఇష్టారాజ్యంగా మారింది. రైతులు, వ్యాపారులు, వినియోగదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం మలక్‌పేట గంజ్, మాదన్నపేట మండీల కోసం హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమించింది. కేవలం మలక్‌పేట గంజ్ పాలకవర్గానికి, అధికారులకు కల్పతరువుగా ఉందని, అందుకే ఇప్పటి వరకు మాదన్నపేట మండీని పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శలు ఉన్నాయి. మాదన్నపేట మార్కెట్‌లో పారిశుధ్యం నిర్వహణ అస్తవ్యస్తం, అక్రమ వసూళ్లు, రాత్రివేళల్లో జరుగుతున్న ఆకుకూరల దందా, ఇతర వ్యవహారాలపై గతంలో స్వయంగా రైతులు, వ్యాపారులు హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం దృష్టికి పలుమార్లు తీసుకువచ్చినా స్పందించలేదు.


చిన్నపాటి వర్షం కురిసినా మార్కెట్‌లో పరిస్థితి(ఫైల్)

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వాలి: సీపీఎం

చంపాపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రమోహన్ డిమాండ్ చేశారు. హస్తినాపురం డివిజన్‌లోని భూపేష్‌గుప్తానగర్ కాలనీలో సోమవారం ఎల్బీనగర్ సర్కిల్ 2వ మహాసభను నిర్వహించారు. టీకేఆర్ కమాన్ నుంచి నందనవనంలోని లక్కీ హోటల్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జెండాను పార్టీ సీనియర్ నాయకురాలు ఎండీ కమర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, సీహెచ్.వెంకన్న, నాయకులు రవీంద్రయాదవ్, శివయ్య, రాములు, శ్రీనివాస్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సాయి సంస్థాన్ అడ్వైజరి బోర్డ్ చైర్మన్ యాదయ్యకు సన్మానం

ఎల్బీనగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ సాయి సంస్థాన్ అడ్వైజరి బోర్డ్ చైర్మన్‌గా ఎన్నికైన వనం యాదయ్య, కమిటీ సభ్యులు వనం రంగయ్యలను అష్టలక్ష్మీ ఆలయం పాలకవర్గం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో అష్టలక్ష్మీ ఆలయ చైర్మన్ సోమా సురేష్‌కుమార్, మాజీ చైర్మన్ బందం దామోదర్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, అయిత అంజయ్య పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని పరిశీలించిన హైడ్రా అధికారులు

సరూర్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని నందిహిల్స్ కాలనీలో గల పార్కు స్థలం కబ్జాకు గురవుతున్నదంటూ ఇటీవల స్థానికులు కొందరు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సోమవారం సంబంధిత అధికారులు అక్కడకు వచ్చి పార్కు స్థలాన్ని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి పార్కు వివరాలు, కబ్జాకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. దీనిపై హైడ్రా కమిషనర్‌కు రిపోర్ట్ అందజేస్తామని బృందంలోని ఓ అధికారి చెప్పారు.

యువకుడి అదృశ్యం


కిషోర్‌కుమార్

హయత్‌నగర్ : ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన రమేష్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి మునగనూరు రామానుజన్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. రమేష్‌కుమార్ కుమారుడు చౌదరి కిషోర్‌కుమార్(20) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం 6గంటలకు చౌదరి కిషోర్‌కుమార్ ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రి అయినా రాకపోవడంతో రమేష్‌కుమార్ సోమవారం ఉదయం తన కుమారుడు కనిపించడం లేదని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక..


మహేశ్వరి

సైదాబాద్ : ఈవెంట్‌లలో డ్యాన్స్ చేసే బాలిక కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సింగరేణికాలనీలో నివాసముండే జీహెచ్‌ఎంసీ కార్మికురాలు ఎరగదింట్ల అలివేలు, యాదగిరిల కుమార్తె మహేశ్వరి(16) ఈవెంట్‌లలో డ్యాన్సర్‌గా పనిచేస్తున్నది. ఈనెల 18న ఈవెంట్‌కు పోతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో పాటు, ఫోన్ స్విచ్చాఫ్ చేసి ఉండడంతో ఆమె ఆచూకీ కోసం వెదకగా లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల నిర్మాణానికి సహకరిస్తా : డీఈఓ


పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈఓ విజయకుమారి

మన్సూరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బండ్లగూడ ప్రాథమిక పాఠశాలకు కేటాయించిన స్థలం పాఠశాలకే చెందేలా కృషి చేయడంతో పాటు పాఠశాల భవనం నిర్మించేందుకు పాటుపడతానని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి పేర్కొన్నారు. కొన్ని రోజులుగా పాఠశాల స్థల వివాదంపై వస్తున్న సమాచారాలు, ఫిర్యాదులను తెలుసుకుని సోమవారం ఉప్పల్ మండల విద్యాధికారి రామారావుతో కలిసి నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్లగూడ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని డీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా బండ్లగూడ ప్రాథమిక పాఠశాలకు సర్వేనంబర్ 36/6 లోని ప్రభుత్వ స్థలంలో కేటాయించిన ఎకరం స్థలంలో కోర్టు వివాదంలో ఉన్న 278 గజాల స్థలం మినహా మిగిలిన స్థలాన్ని పాఠశాలకు అప్పగించి పాఠశాల నిర్మాణానికి సహకరించాలని బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు డీఈఓను కోరుతూ వినతిపత్రం సమర్పించగా ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నమ్మ, ఉపాధ్యాయులతో పాటు సమితి సభ్యులు, గ్రామస్థులు తూర్పాటి సంజీవ, సీహెచ్ జంగయ్య, నగెల్లి సహదేవ్‌గౌడ్, శ్రీనివాసచారి, గడ్డం రామారావు, మెట్టు సత్యనారాయణ, కందికంటి రాఘవేందర్, సుర్వి జంగయ్య, పాశం వెంకటేశ్, జి.వెంకటేశ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి


సర్వే ట్రయల్‌ను నిర్వహిస్తున్న అధికారులతో కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ చేపట్టిన ఘన వ్యర్థాల నిర్వహణ(సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్) సర్వే నగర పరిశుభ్రతకు ఎంతగానో దోహదపడుతుందని, ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ నగర పరిశుభ్రతకు చేపట్టిన ఈ సర్వేలో భాగంగా సోమవారం మన్సూరాబాద్‌లోని విజయశ్రీకాలనీలో ఎస్‌డబ్ల్యూఎం ఈఈ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది చేపట్టిన ఈ సర్వే ట్రయల్‌లో కార్పొరేటర్ సైతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూఎం సర్వేలో భాగంగా వ్యర్థాల సేకరణ పద్ధతులు, చెత్తసేకరణ వాహనాల వినియోగం, వ్యర్థాల విభజన, ఈ-వ్యర్థాలు, స్థూల వస్తువులు, ప్రత్యేక వ్యర్థాల పారబోత, సేకరణ వంటి అంశాలను సేకరించి వాటి నిర్వహణపై స్థానికులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చామన్నారు. నగర పరిశుభ్రతకు చేపట్టిన ఈ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ఇందుకు తమ సహకారం కూడా ఉంటుందని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, కాలనీవాసులతో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 8,9,10వ తరగతికి చెందిన 16మంది విద్యార్థులు ఈ టెస్ట్‌లో పాల్గొని పరీక్షలు రాశారు. పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రమేష్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో పోటీ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులకు భవిష్యత్‌లో రాసే పరీక్షల సమయంలో భయం ఉండదన్నారు. మండల స్థాయిలోని విజేతలకు జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మహిపాల్ కరంటోత్ మాట్లాడారు. ఈ సందర్భంగా టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రంతో పాటు మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి భువనేశ్వరీ, జిల్లా వాయిస్ ఆఫ్ తెలంగాణ కన్వీనర్ వెంకటేష్, ఉపాధ్యాయులు ఎర్రయ్య, నవీన్, రజిని, ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపు షిరిడీ సాయి మందిరాల నిర్వాహకులతో సమావేశం

మన్సూరాబాద్ : షిరిడీ సాయిబాబా స్వామి వారిపై కొంత కాలంగా వస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ తెలంగాణ వ్యాప్తంగా ఉన్న షిరిడీ సాయిబాబా మందిరాల నిర్వాహకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో షిరిడీ సాయి భక్త ఐక్యవేదిక తెలిపింది. హైదరాబాద్ నగరం నాగోల్ డివిజన్ పరిధిలోని దేవకి కన్వెన్షన్ హాలులో ఈనెల 27న ఉదయం 9గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, తెలంగాణలోని షిరిడీ సాయిబాబా మందిర నిర్వాహకులు, సిబ్బంది అధిక సంఖ్యలో విచ్చేసి సాయినాథుడిపై వస్తున్న ఆరోపణలకు చరమగీతం పాడాలని షిరిడీ సాయి భక్త ఐక్యవేదిక పిలుపునిచ్చింది. సమావేశానికి వచ్చేవారు ఎలాంటి సందేహాలు ఉన్నా సెల్: 8885003535 నంబర్‌లో తమను సంప్రదించాలని సూచించింది.

పోక్సో కేసులో నిందితుడికి జైలు, జరిమానా

రంగారెడ్డి కోర్టులు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో ఓ బాలికను వేధించి అసభ్యంగా ప్రవర్తించి, లైంగికదాడికి పాల్పడిన నిందితుడు మహ్మద్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5వేల జరిమానాతో పాటు బాధితురాలికి లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలని పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి తీర్పు చెప్పారు. పీపీ సునీత బర్ల కథనం ప్రకారం బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిందితుడు మహ్మద్ ఓ బాలికను ప్రేమపేరుతో వేధించడమే కాకుండా అసభ్యంగా ప్రవర్తించి లైంగికదాడికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసిన బాలాపూర్ పోలీసులు సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. సాక్ష్యులను విచారించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి పద్మావతి నిందితుడికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానాతో పాటు బాధితురాలికి లక్ష రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

మరో కేసులో..

ఓ బాలికపై దాడికి యత్నించిన నిందితుడికి జైలు, జరిమానాతో పాటు బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని తొమ్మిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి హరీష్ తీర్పు చెప్పారు. పీపీ నరేష్‌కుమార్ కథనం ప్రకారం.. యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో వరికుప్పల మహేష్ అనే యువకుడు ఓ బాలికను మభ్యపెట్టి అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా లైంగికదాడికి పాల్పడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు సాక్ష్యాధారాలతో సహా కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్షులను విచారించిన తొమ్మిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి హరీష్ నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 25వేల జరిమానాతో పాటు బాధితురాలికి రూ. 5లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.


దివ్యాంగుల ఆటల పోటీలు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్, డీవైఎస్ఓ వెంకటేశ్వర్‌రావు

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడోత్సవాలు

ఎల్బీనగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సరూర్‌నగర్ స్టేడియంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం క్రీడోత్సవాలు నిర్వహించారు. సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి క్రీడోత్సవాలను ప్రారంభించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో దివ్యాంగులకు 50మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్ల విభాగంలో పరుగు పందెం, షాట్‌పుట్, చెస్, క్యారమ్స్, వీల్ చైర్, ట్రై సైకిల్ రేస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీవాణి మాట్లాడుతూ వైకల్యం లక్ష్యసాధనలో అడ్డుకాదన్నారు. ఈ జిల్లా స్థాయి పోటీలలో విజేతలను రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. ఈ ఆటల పోటీలలో మొత్తం జిల్లా నుంచి దాదాపు 500 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీడీఆర్సీ ప్రతినిధి రమేష్, సీడీపీఓలు, ఐసీడీఎస్ స్టాఫ్, ఐసీపీఎస్ సిబ్బంది, డిసెబుల్డ్, డీహెచ్ఈడబ్ల్యూ, సఖి సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడ్డ ప్రతీ నాయకుడికి కాంగ్రెస్‌లో తగిన గుర్తింపు : సత్యనారాయణ

మన్సూరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసిన ప్రతీ నాయకుడు, కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం దక్కుతుందని, ఇందుకు తానే నిదర్శనమని హైదరాబాద్ మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్, పార్టీ మన్సూరాబాద్ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఏకలవ్య కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా బుడ్డ సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, పార్టీ పెద్దలు, నాయకులకు బుడ్డ సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఏకలవ్య కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుల్తాన్ వెంకటేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొనేటి చిన్న నర్సింహ, కాలనీ వ్యవస్థాపకుడు వనం గంగయ్య, సభ్యులు సెద్దిని స్వామి, కందల శంకరయ్య, కె.గణేశ్, కొనేటి ధనుంజయ్య, వెంకటేశం, రమేష్, సుధాకర్, రవి, నాగమ్మ, సుగుణ, లక్ష్మి పాల్గొన్నారు.


సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాలకిషన్, ప్రతినిధులు

1న మాలల సింహగర్జనను జయప్రదం చేయాలి : బేర బాలకిషన్

ఎల్బీనగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న జరుపతలపెట్టిన మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని తెలంగాణ మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ పిలుపునిచ్చారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని రామకృష్ణాపురం డివిజన్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం చౌరస్తాలో సింహగర్జన పోస్టర్‌ను రామకృష్ణాపురం డివిజన్ మాల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు ముచ్చింతల జగన్, ప్రధాన కార్యదర్శి ఏనుక యాదయ్యతో కలిసి ఆయన ఆవిష్కరించారు. డిసెంబర్ ఒకటో తేదీన జరిగే మాలల సింహగర్జన చారిత్రాత్మకమైనదన్నారు. మహేశ్వరం నియోజకవర్గం నుంచి వేలాది మంది బహిరంగ సభకు హాజరుకావాలని కోరారు. ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్ మాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓయూ గేట్లు రాత్రి తొమ్మిది వరకు ఓపెన్

హైదరాబాద్ సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ ప్రధాన గేట్లను రాత్రి 9గంటల వరకు తెరిచి ఉంచాల్సిందిగా వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.కుమార్ భద్రతా సిబ్బందిని ఆదేశించారు. అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వీసీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉస్మానియా వర్సిటీ ప్రధాన గేట్లు (ఎన్‌సీసీ వైపు, పోలీస్‌స్టేషన్ వైపు) రాత్రి 8 గంటలకు మూసివేస్తుండగా... తాజా నిర్ణయంతో మరో గంట అదనంగా వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించారు. రామంతాపూర్ వైపుగా ఉన్న రవీంద్రనగర్ కాలినడక ద్వారం నుంచి కూడా రాకపోకలకు ఉదయం, సాయంత్రం కొంత వెసులుబాటు కల్పించారు. ఓయూలో పలు నిర్మాణాలు జరుగుతుండడంతో అక్కడే నివాసముంటున్న కూలీల పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు వీలుగా పాఠశాల సమయానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.